ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు



సింగరేణి క్వార్టర్‌లో కొనసాగుతున్న బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ కార్యాలయం

- అద్దె భవనాల్లో అరకొర వసతులు
- ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రజలు
- డివిజన్, మండలాల ఏర్పాటుతోనే సరి
- దండేపల్లి మండలంలో దశాబ్దాలుగా అద్దె భవనాల్లోనే

ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. సొంత భవనాలు నిర్మించక పోవడంతో ప్రభుత్వ ఖజానాపై భారం పడుతోంది. సరైన వసతులు లేక అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాలకు చెల్లించే అద్దెతో భవన నిర్మాణాలు పూర్తయ్యేవనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు.

బెల్లంపల్లి, జూన్ 20:బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్, మండలాలు ఏర్పాటైన సొంత భవనాలు లేకపోవడంతో అసౌకర్యాల నడుమ పాలన కొనసాగుతోంది. బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ కావడంతో ఆర్డీవో కార్యాలయంతోపాటు డివిజన్ స్థాయి కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో అధ్వాన్న పరిస్థితుల నడుమ కొనసాగుతున్నాయి. ఏండ్లు గడుస్తున్నా సొంత భవనాలు లేకపోవడంతో ప్రజలతో పాటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ కార్యాలయాలకు భవన నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రజాప్రతినిధులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● పేరుకే రెవెన్యూ డివిజన్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసే క్రమంలో బెల్లంపల్లిని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యాక ఆర్డీవో, ఏసీపీ, డీఎల్‌పీవో, ఏడీఏ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సింగరేణి క్వార్టర్లలో ఆర్డీవో కార్యాలయం, ఏసీపీ కార్యాలయం, ఏడీఏ కార్యాలయం, సింగరేణి స్కూల్ భవనంలో తహసీల్దార్ కార్యాలయం, ట్రెజరీ కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ డివిజన్‌లో శిథిలావస్థలో ఉన్న, అద్దె భవనాల్లో కార్యాలయాలు కొనసాగుతున్నాయి.

● సమస్యల వలయంలో కార్యాలయాలు

రెవెన్యూ డివిజన్‌లో తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థలో ఉంది. వర్షాకాలంలో స్లాబ్ పెచ్చులూడి కింద పడిన సందర్భాలున్నాయి. ఏడీఏ కార్యాలయం పాములు సంచారంతో అధికారులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు కనీసం కూర్చోవడానికి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు కార్యాలయాల ఆవరణలో ఉన్న చెట్ల కింద వేచిఉండాల్సిన పరిస్థితి ఉంది.



శిథిలావస్థలో ఉన్న ఏడీఏ కార్యాలయం

బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడి ఏండ్లు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించలేదు. ప్రజాప్రతినిధులు స్పందించి సొంత భవనాలకు నిధులు మంజూరు చేసి నిర్మాణాలను చేపట్టేలా చూడా లని ప్రజలు కోరుతున్నారు.

కొత్త మండలంలో వసతులు శూన్యం

● అద్దె భవనాల్లో కార్యాలయాలు ● ఆసుపత్రికి దిక్కే లేదు



ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

కన్నెపల్లి: ప్రజలకు సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం నూతన మండలాలను ఏర్పాటు చేసింది. 2016లో భీమినిలో ఉన్న కన్నెపల్లిని మండలంగా ఏర్పాటు చేశారు. మండలం ఏర్పడి 8 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ అభివృద్ధి జరగలేదు. ఎంపీడీవో కార్యాలయం అద్దె భవనంలో, ప్రభుత్వ పాఠశాలలో తహసీల్దార్ కార్యాలయం, అతిథి గృహంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో కొనసాగుతుండడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంఈవో కార్యాలయం నిర్మాణం చేపట్టిన ప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఎంపీడీవో కార్యాలయానికి అద్దె చెల్లించక పోవడంతో యజమాని తాళం వేశాడు.

● ఆసుపత్రి లేక ఇబ్బందులు



అద్దె ఇంట్లో కొనసాగుతున్న ఎంపీడీవో కార్యాలయం

మండలంలో ప్రభుత్వ ఆసుపత్రి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా అనారోగ్యం వస్తే మండలానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెల్లంపల్లి, నెన్నెల, భీమిని మండలాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుంది. ఆత్మహత్యాయత్నాలకు పాల్పడిన వారిని, పాము కాటు వేసిన వారిని, రోడ్డు ప్రమాదాలు జరిగిన వారిని ఆసుపత్రులకు తరలించాలంటే అంబులెన్స్ రావడానికి గంట సమయం పడుతోంది. దీంతో రోగుల పరిస్థితి విష మించి పలువురు మృతిచెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. చిన్న జ్వరం వచ్చిన సరే మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో ఇతర మండలాలకు వెళ్లాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

దశాబ్దాలుగా అద్దె భవనాల్లోనే



దండేపల్లిలో అద్దె భవనంలో బీసీ బాలుర వసతి గృహం

దండేపల్లి: ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత గూడు కరువవుతోంది. అద్దె భవనంలో సరైన వసతులు లేక ప్రజలు, ప్రజాప్రతినిధులకు ఇబ్బందులు తప్పడం లేదు. దండేపల్లిలో పోస్టాఫీస్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, దండేపల్లి, ముత్యంపేటలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్, మ్యాదరిపేటలో యూనియన్ బ్యాంకు, తాళ్లపేటలో స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాద్ అద్దె భవనంలో కొనసాగుతున్నాయి.

బీసీ బాలుర వసతి గృహలు అద్దె గృహంలోనే కొనసాగుతున్నాయి. మండలంలోని 66 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అందుల్లో కేవలం 3 అంగన్‌వాడి కేంద్రాలకు పక్కా భవనంలో, 43 కేంద్రాలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, 20 కేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. సంబంధితశాఖ అధికారులు స్పందించి సొంత భవనాలు నిర్మించి అధికారులకు, ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా ఐకేపీ, పశువైద్యశాల భవనాలు

దండేపల్లి మండల కేంద్రంలో ఐకేపి కమ్యూనిటీ హాల్, పశువైద్యశాల కేంద్రాలకు భవన నిర్మాణాలకు నిధులు రాక పనులు ముందుకు సాగడం లేదు. ఐకేపీ భవన నిర్మాణానికి ఆరేళ్ల క్రితం రూ.32 లక్షల నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. పశువైద్యశాల భవనానికి రూ.13 లక్షలు నిధులు మంజూరు చేశారు. రెండు భవనాలకు ఓపెన్ స్లాబ్ వరకు పనులను సంబంధిత కాంట్రాక్టర్లు పూర్తి చేశారు. మిగతా పనులు చేపట్టేందుకు నిధులు కొరత ఏర్పడటంతో కాంట్రా క్టర్లు మధ్యలోనే నిలిపివేశారు. యేండ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు పూర్తి చేయించడంలో అధికారులు ప్రజాప్రతి నిధులు దృష్టి సారించడం లేదు.



అద్దె భవనంలో పోస్ట్ ఆఫీస్

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

బెల్లంపల్లి, జూన్ 20: నీట్ పరీక్షలను రద్దు చేయాలని గురువారం బెల్లంపల్లి పట్టణంలో బీఆర్ఎస్‌వీ నాయకులు ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ మాట్లాడుతూ నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, దీంతో విద్యార్థులు నష్టపోయారన్నారు. పరీక్షను రద్దు చేసి జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాకేష్, అరుణ్‌ప్రణీత్, అరవింద్,అరుణ్ ప్రసాద్,కుషల్, సురేష్, శేఖర్, మహేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమారం, జూన్ 20: మండల కేంద్రంలోని 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు చేపడుతున్నందున శుక్రవారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు సహకరించాలని కోరారు.

ఆరు గ్యారంటీల అమలు లో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఏసీసీ, జూన్ 20: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ఆరు నెలలు దాటినా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ, రైతు భరోసా ఎకరానికి రూ.15వేలు, మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4 వేల పింఛన్, యువతకు రూ.5 లక్షల విద్యాభరోసా, నిరుద్యోగులకు రూ.4 వేల నిరుద్యోగ భృతి హామీలను అమలు చేయకుండా వంచించారన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అవినీతి, గుండాయిజం, రౌడీయిజంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులకు నష్టపరిహారం, రాళ్లవాగు కరకట్ట ఏమైందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే స్వలాభం కోసం మంచిర్యాల-అంతర్గాం వంతెనను మరో చోట తరలించేందుకు సిద్ధమయ్యారన్నారు. సమావేశంలో పురుషోత్తం, శ్రీదేవి, మల్లేష్, అశ్విన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేకల సంత వేలం

హాజీపూర్, జూన్ 20: మండలంలోని వేంపల్లి పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం మేకల సంత వేలం నిర్వహించారు. వేలంలో ఏడుగురు పాల్గొనగా పొనుగంటి సాయితేజ రూ.32.10 లక్షలకు దక్కించుకున్నట్లు స్పెషల్ ఆఫీసర్ గంధ్ర హరిత తెలిపారు. గడువులోగా డబులు చెల్లించని పక్షంలో వేలంలో అధికంగా పాడిన రెండో వ్యక్తితకి అవకాశం ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, ఎంపీటీసీ డేగ బాపు తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఈసీ మెంబర్‌గా ప్రకాష్‌రెడ్డి



ఏసీసీ, జూన్ 20: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే, ఐజేయూ) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రూపురెడ్డి ప్రకాష్‌రెడ్డి ఎన్నికయ్యారు. రాష్ట్ర మహా సభల్లో ఖమ్మంలో రెండు రోజులుగా జరుగుతున్నాయి. గురువారం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు నిర్వహించగా ప్రకాష్‌రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలువు రు జర్నలిస్టులు ఆయనను అభినందించారు.

నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 20: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో డీఎంహెచ్‌వో అనిత, డీఈవో యాదయ్య, సంక్షేమాధికారి చిన్నయ్యతో కలిసి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థినులకు మాత్రలు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు మాత్రలను వేశామని, జిల్లాలో 2,01,143 మంది పిల్లలు ఉన్నారని, మాత్రలు అందని వారికి ఈ నెల 27న మాప్ అప్ రౌండ్ ద్వారా అందిస్తామని తెలిపారు. నులిపురుగులు ఉంటే పిల్లల్లో పోషకహార లోపం, రక్తహీనత ఉంటుందని, ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని సూచించారు. ప్రోగ్రాం అధికారి నీరజ, ఎన్‌హెచ్‌ఎం డీపీవో ప్రశాంతి, వైద్యాధికారి అశోక్, సెక్టోరల్ అధికారి చౌదరి, ప్రధానోపాధ్యాయులు పద్మావతి, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్(కాసిపేట): కోనూరు, వెంకటాపూర్, సోనాపూర్, తాటిగూడ గ్రామాల్లో నులి పురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. విద్యార్థులకు మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో నాగరాజు, వైద్య సిబ్బంది , పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జైపూర్: నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని డీఎంహెచ్‌వో అనిత సూచించారు. ఇందారం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల్లో నులి పురుగులు ఉంటే ఆల్బెండజోల్ మాత్రల ద్వారా నశిస్తాయని తెలిపారు. డీడబ్ల్యూఓసీ చిన్నయ్య, ఏసీడీపీవో హేమ సత్య, ప్రోగ్రాం ఆఫీసర్ శివ ప్రతాప్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, మెడికల్ ఆఫీసర్ శ్రావ్య పాల్గొన్నారు. గంగిపల్లి, టేకుమట్లతోపాటు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మాత్రలను వేశారు. ఎంపీవో అనిల్‌కుమార్, వైద్యురాలు వేదశ్రీ, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, హెచ్‌ఎం చంద్రకళ, ఏఎన్‌ఎంలు మమతరాణి, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

హాజీపూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. దొనబండ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం హన్మాండ్లు విద్యార్థులకు మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో 8694 మంది పిల్లలకుగాను 7132 మందికి మాత్రలను వేసినట్లు మండల వైద్యాధికారి లహరి తెలిపారు. ఎంపీటీసీ బేతు రమాదేవి, ఏఎన్‌ఎం వెంకటలక్ష్మీ, ఆశా కార్యకర్త రజనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నూరు: పట్టణంలోని గురుకుల పాఠశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, కౌన్సిలర్ రేవెల్లి మహేష్, వైద్యులు కృష్ణతేజ, రామకృష్ణ, సిబ్బంది జగదీష్, సత్తయ్య, పాల్గొన్నారు.

భీమిని: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరిలక్ష్మణ్ నులిపురుగుల నివారణ మందులు వేసి కార్యక్రమాన్ని ప్రారంభిచారు. అర్హులైన వారందరు తప్పకుండా మందులు వేసుకోవాలని సూచించారు. కేజీబీవీ ఎస్‌వో కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నెపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీ పాఠశాలల్లో ఎంపీపీ సృజననర్సింగరావు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఉపాధ్యాయులు, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కోనూరులో మాత్రల పంపిణీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మందమర్రిటౌన్/రూరల్, జూన్ 20 : రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో 58 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పుడు పనుల వల్ల నెలకు రూ.14 వేల కోట్లు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం నిత్యం పాటు పడుతున్నారని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీ, ఎంపీపీ గుర్రం మంగ, జెడ్పీటీసీ రవి, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, ఎంపీడీవో రాజేశ్వర్, డిప్యూటి తహసీల్దార్ రవీందర్, ఆర్‌ఐ పద్మజ, ఎంపీవో బీరయ్య, నాయకులు గుడ్ల రమేష్, కొమురయ్య, ప్రభాకర్‌రావు, నర్సింగ్, శ్రీనివాస్‌గౌడ్, పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం

మండలంలోని చిర్రకుంటలో లక్ష రూపాయలతో ఏర్పాటు చేసిన బోరు మోటారును ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎంపీపీ గుర్రం మంగ, మాజీ సర్పంచు కొమురయ్య,రాంచందర్, విజయ పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకంపై వినతి

పట్టణంలో గృహలక్ష్మీ పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంటుకు తమకు అర్హత ఉన్నా అధికారులు బిల్లులు వసూలు చేస్తున్నారని పేర్కొంటూ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి పలువురు వినతి పత్రం అందిం చారు. గృహలక్ష్మీ పథకానికి సంబంధించి అధికారులతో మాట్లాడి ఉచిత కరెంటు వర్తించేలా చూడాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

కూరగాయల మార్కెట్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

బెల్లంపల్లి, జూన్ 20: పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ సముదాయాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కూరగాయల భవన సముదాయాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించకుండా త్వరగా పనులను పూర్తి చేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ నిర్మాణ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఎప్పటికప్పుడు చెత్త సేకరణ చేపట్టాలని, ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు, బండి ప్రభాకర్, సురేష్, రాములునాయక్ పాల్గొన్నారు.

భూకబ్జాపై ఫిర్యాదు

తాండూర్ మండలంలోని రాంపూర్ శివారులో ఉన్న చెరువు శిఖం భూమి కబ్జాకు గురవుతుందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు పలువురు రైతులు విన్నవించారు. దాదాపు 15 ఎకరాల చెరువు శిఖంలో మట్టి నింపి అక్రమార్కులు చెరువును కబ్జా చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో పంట పొలాలకు నీరందడం లేదని వాపోయారు. ఎంపీడీవో, తహసీల్దార్, ఆర్డీవోకు, ఇరిగేషన్ శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదన్నారు. రైతులు మల్లేష్, శంకర్, సత్తయ్య, సురేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్: కర్ణాటక రాష్ట్రంలో ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగిన సౌత్‌జోన్ ఖేలో ఇండియా వుషు ఉమెన్స్‌లీగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ కుమార్ దీపక్ తన చాంబర్‌లో అభినందించారు. క్రీడాకారులు నవీన, అనిత, మన్విత లక్ష్మీరాజ్, హర్షిత, హాసీనీలు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా యువజన క్రీడా అధికారి రాజ్‌వీరు, కోచ్ శివ మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

ఆటో యూనియన్ కార్యవర్గం

రామకృష్ణాపూర్, జూన్ 20: రామకృష్ణాపూర్ ఆటో యూనియన్ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా ఎనగంటి సంపత్, వైస్ ప్రెసిడెంట్‌గా పాక అంజన్న, గౌరవ అధ్యక్షుడిగా గాండ్ల సమన్న, జనరల్ సెక్రెటరీ జీడి రవి, అల్కాపున్నం, కోశాధికారి సార య్య, సీతారాంలను ఎన్నుకున్నారు. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఊరకొలుపు

భీమారం, జూన్ 20: కొత్తపల్లిలో గురువారం ఊరకొలుపు నిర్వహించారు. ఇందులో భాగంగా డప్పుచప్పుళ్లతో పంబాల వారు జమ్మిడికలతో ఊరకొలుపును నిర్వహించి గ్రామ దేవతలకు పూజలు చేశారు. భూలక్ష్మీ దేవతను ఊరేగించారు. మాజీ సర్పంచ్ తిరుపతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి

భీమారం, జూన్ 20 : మండల కేంద్రంలోని బాల్‌రెడ్డి కొట్టాల సమీపంలో గురువారం ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్లు తగిలి రెండు ఎద్దులు మృతిచెందాయి. మండల కేంద్రానికి చెందిన పల్ల శ్రీనివాస్, భూపెల్లి లచ్చయ్యకు చెందిన ఎద్దులు రెండు రోజుల క్రితం మేతకు వెళ్ళి తిరిగి రాలేదు. గురువారం మృతి చెంది ఉండడాన్ని ట్రాక్టర్ డ్రైవర్ సురేష్ గుర్తించి యజమానులకు సమాచారం అందించారు. విద్యుత్‌శాఖ అధికారులు పంచనామా నిర్వహించారు. ఒక్కో ఎద్దుల విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు

మందమర్రిటౌన్, జూన్ 20 : పట్టణంలోని కేకే 5 ఫిల్టర్ బెడ్ ఏరియాకు చెందిన కస్తూరి లింగయ్య ఇంట్లో గంజాయి మొక్కలను పెంచుతున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గురువారం లింగయ్య తనిఖీ చేయగా 13 గంజాయి మొక్కలు ఉండడాన్ని గుర్తించారు. గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని లింగయ్యపై కేసు నమోదుచేశామని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

23న హెచ్ఆర్‌సీఐ సమావేశం

ఏసీసీ, జూన్ 20: హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా రాష్ట్ర స్థాయి సమావేశం ఈనెల23న జిల్లాకేంద్రంలోని నార్తిన్ హోటల్‌లో నిర్వహిస్తు న్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయకార్యవర్గ సమావేశం నిర్వహిస్తామన్నారు.

రేపు చెక్కుల పంపిణీ

నస్పూర్, జూన్ 20: మున్సిపాలిటీ పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం ఆఫీసర్స్‌క్లబ్‌లో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు చేతులమీదుగా పంపిణీ ఉంటుందని తహసీల్దార్‌శ్రీనివాస్ ఒకప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఆధార్‌కార్డు, రెవెన్యూస్టాంపులతో హాజరై చెక్కులను తీసుకోవాలని కోరారు.

మెరుగైన ఆరోగ్యం కోసం 'యోగా'

● నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



యోగా చేస్తున్న కాలనీ వాసులు

కాగజ్‌నగర్, జూన్ 20: పోటీ ప్రపంచలో పని ఒత్తిడి, మానసిక ఇబ్బందులతో తరుచూ అనారోగ్య సమస్యలు ఏర్పడుతుంటాయి. వీటి నివారణకు యోగా చక్కటిబాటలు వేస్తుంది. యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు ఇట్టే నయమవుతాయన్నది ప్రముఖుల వాదన. కేవలం భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగాయోగా విశేషఆదరణ లభిస్తోంది.

యోగా శిబిరాలకు స్పందన..

ప్రతి ఒక్కరికి యోగా నేర్పుకోవాలన్న లక్ష్యంతో పతంజలి పీఠ్ ఆధ్వర్యంలో కాగజ్ నగర్‌లోని 30 వార్డుల్లో పది కేంద్రాలు నడుస్తున్నాయి. యోగా నేర్చుకునేందుకు మహిళలు అధికంగా వస్తున్నారు.

ఉదయం 5నుంచి యోగా శిబిరాలు ప్రారంభమవుతున్నాయి. అరగంట తర్వాత పండ్లతో తయారు చేసి పానియాలు, నానబెట్టిన శనగలు, పల్లీలు, పెసర్లు ఇస్తున్నారు. దీంతో బరువు తగ్గటమే కాకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు శరీరం అలసట లేకుండా ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.



20 సంవత్సరాల నుంచి యోగా చేస్తున్నాను..
-చంద్రశేఖర్, యోగా గురువు, కాగజ్‌నగర్

నేను20ఏళ్లనుంచి యోగా చేస్తున్నాను. ఇతరులకి నేర్పిస్తున్నాను. దైనందిన జీవితంలో యోగా ప్రతి ఒక్కరికి అవసరం. యోగాతో అన్ని వ్యాధులు దూరమవుతాయి. డబ్బులుఖర్చులు పెట్టాల్సిన అవసరం లేదు.



నిత్యం యోగా చేస్తాను..
-జితేందర్ డాకుల్కర్, సర్‌సిల్క్ కాలనీ

నేను వ్యాపారం చేస్తుం టాను. ఉదయం నుంచి రాత్రివరకు బిజీబిజీగా గడుపుతాను. ఉదయం యోగా చేయటంతో ప్రశాంతత ఏర్పడుతుంది. ఎలాంటి వ్యాధులు దరిచేరవు. అందరికీ యోగాచేయాలని సూచిస్తున్నాను.

ఘనంగా యోగా దినోత్సవం

ఏసీసీ, జూన్ 20: మంచిర్యాల మైత్రియోగా ప్రకృతి చికిత్స కేంద్రంలో గురువారం యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సుకుమార్, డాక్టర్ సమీరాలు పలువురితో సూక్ష్మ వ్యాయామాలు, యోగసానాలు, ప్రాణాయామం, ధ్యానం చేయించి వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా ప్రధాన జడ్జి శ్రీనివాసులు మాట్లాడుతూ శరీరం, ఆలోచనలు, మనస్సును చక్కగా ఉంచగలిగేది యోగా ఒక్కటేనని తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమణ, డాక్టర్ సూర్యనారయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, సుధాకర్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీనివాసులు

యోగా దినోత్సవానికి ఏర్పాట్లు

మందమర్రిటౌన్: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం సింగరేణి పాఠశాల మైదానంలో యాజమాన్యం యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. సింగరేణి గనులు, డిపార్టుమెంట్లలో యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. యోగా శిక్షకుడు కొంపెల్లి రమేష్ ప్రజలకు ఉచిత యోగా శిక్షణ అందిస్తున్నారు. అలాగే పట్టణానికి చెందిన ముల్కల శంకర్ యోగా నేర్పిస్తున్నారు. రోజు ఉదయం 6 గంటలకు సింగరేణి మైదానంలో యోగా కేంద్రంలో ప్రజలందరికి యోగా నేర్పిస్తూ ఆరోగ్య సూత్రాలు వివరిస్తున్నారు.

జిల్లా ప్రధాన జడ్జిని కలిసిన కలెక్టర్



ఏసీసీ, జూన్ 20 : మంచిర్యాల జిల్లా ప్రధాన జడ్జి బోయ శ్రీనివాసులును గురువారం జిల్లా కోర్టులోని ఆయన చాంబర్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాద పూర్వకంగా కలిశారు. జడ్జికి కలెక్టర్ మొక్కను అందజేశారు.

ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలి

ఏసీసీ, జూన్ 20: ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నా, అనుమతులు లేకుండా పాఠశాలలు నడుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో మద్యానికి మంత్రి ఉన్నాడు కానీ విద్యాశాఖకు మంత్రి కరువయ్యాడని ఎద్దేవా చేశారు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ద్వారా పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు. అజయ్, రిషి, రిద్విక్‌వర్ధన్, హర్ష పాల్గొన్నారు.

ఎంఈవోకు వినతి

మందమర్రిటౌన్, జూన్ 20 : నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని గురువారం మందమర్రి ఎంఈవోకు ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ అభిరామ్ వినతి పత్రం అందించారు. మందమర్రి పట్టణం, మండలానికి చెందిన విద్యార్థులు గురుకులాల్లో, మోడల్ స్కూళ్లలో సీట్లు సాధించగా గతంలో చదివిన ప్రైవేటు పాఠశాలలకు వెళితే సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. మరికొన్ని పాఠశాలల యాజమానులు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధంచేయాలి

వేమనపల్లి, జూన్ 20: వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులను కల్పించాలన్నారు. పారిశుధ్య పనులను నిర్వహించాలని, సామాజిక తనిఖీ రికార్డులను సిద్ధం చేయాలన్నారు. మిషన్ భగీరథ సర్వేను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీవో సత్య ప్రసాద్, ఈసీ మధుకర్ పాల్గొన్నారు.

భీమారం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాథోడ్ రాధ పేర్కొన్నారు. కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు వ్యాధులు రాకుండా మురికి కాలువలను శుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, రోజు చెత్త సేకరించి డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు.

టాయిలెట్స్, బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి

నస్పూర్, జూన్ 20: సీసీసీకార్నర్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్, బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని గురువారం సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ సీసీసీ కార్నర్ వద్ద అధికసంఖ్యలో ప్రయాణికులు ఉంటారని, పబ్లిక్ టాయిలెట్స్, బస్‌షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు నెలల్లో ఏర్పాటుచేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు.మిడివెల్లిరాజ్‌కుమార్, గంగాధర్‌చారి, కుమారస్వామిపాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

బెల్లంపల్లి, జూన్ 20: పట్టణంలోని కొత్త బస్టాండ్ మూలమలుపు వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణకు చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ అఫ్సర్ గురువారం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. బస్సులు బస్టాండ్‌కు వెళ్లే మూలమలుపు వద్ద ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్నారని తెలిపారు. బస్టాండ్ ప్రాంతం నుంచి వరదనీరు వస్తుందని సమస్యపరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

దండేపల్లి, జూన్ 20: బీసీ జనగణన చేపట్టి రిజర్వేషన్ కేటాయించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి మనోహర్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ బీసీ కులగణన చేసి తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం జనగణనచేపట్టిన తర్వాతనే బీసీరిజర్వేషన్‌ను ప్రకటించాలన్నారు. బొలిశెట్టి లక్ష్మీనారాయణ, వోడ్నాల శంకర్, స్వర్గంశంకరయ్య, ఎనగందుల సత్యం, గాలిపెల్లి వెంకటపతి, కట్లశ్రీదర్, సత్తయ్యశేఖర్,గంగన్న పాల్గొన్నారు.

మత్స్యశాఖ చైర్మన్ నియామకంపై ప్రభుత్వం పునరాలోచించాలి

చెన్నూరు, జూన్ 20: మత్స్యశాఖచైర్మన్ నియామకంపై ప్రభుత్వం పునరాలోచించాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు సాధనబోయిన కృష్ణ ముదిరాజ్ గురువారం ఒకప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోసుమారు5వేల మత్స్యశాఖ సంఘాలు ఉండగా, ఇందులో 4300 ముదిరాజ్ కులస్తులు ఉన్నారని తెలిపారు. కేవలం700 ఉన్న బెస్త కులస్తులకు రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ నియమించడంతో ముదిరాజ్‌లకు అన్యాయం జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అతితక్కువ ఉన్న బెస్తకులానికి చైర్మన్ పదవి ఇవ్వడం అన్యాయన్నారు. ఈ విషయంపై పునరాలోచించాలని కోరారు.

రైతులకు అవగాహన

మందమర్రిరూరల్(కాసిపేట), జూన్ 20: మండలంలోని వెంకటాపూర్, కొండాపూర్, ముత్యంపల్లి గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయాధికారి వందన పర్యటించి పత్తిపంటలను పరిశీలించారు. రైతులకు పత్తిపంటల సాగుపై అవగాహన కల్పించారు. పంటల విషయంలో ఏమైనా సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు పొందాలని సూచించారు. ఏఈవోలు రమ్య, అంజలి, రైతులు పాల్గొన్నారు.

స్థలం కబ్జా కాకుండా చూడాలి

బెల్లంపల్లి, జూన్ 20: పట్టణంలోని సింగరేణి కళావేదిక పక్కన అంబేద్కర్ భవనం కోసం కేటాయించిన స్థలం కబ్జా కాకుండా చూడాలని పూలే పెరియార్ అంబేద్కర్ ఆలోచన వేదిక సంఘం నాయకులు గురువారం ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ సింగరేణి కళావేదిక పక్కన మూడెకరాలను అధికారులు భవనం కోసం కేటాయించారని, ప్రస్తుతం స్థలం కబ్జాకు గురవుతుందన్నారు. కూరగాయల హోల్‌సేల్ వ్యాపారులు కొందరు అడ్డాగా మార్చుకుని కబ్జాకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ఇతర కుల సంఘాల నాయకులు ఈ స్థలంలో వారి భవనం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. సంఘం అధ్యక్షుడు గోడిసెల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి రంగ ప్రశాంత్, నాయకులు రాజం, స్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

బెల్లంపల్లి, జూన్ 20: బెల్లంపల్లి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గురువారం ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేష్‌లు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 34 వార్డుల్లో సరైన రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెయిన్ డ్రైనేజీలు నిండిపోయి నీరు ఒకే చోట నిలుస్తుందని, చెత్తబండ్లు వార్డుల్లోకి సరిగ్గా రావడం లేదని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండడానికి పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని కోరారు.

వర్షం కోసం కప్పతల్లి ఆట

ఆసిఫాబాద్, జూన్ 20: వానాకాలం సీజన్ ప్రారంభమై 20 రోజులు గడిచినప్పటికీ వర్షం పడకపోవడంతో జిల్లాలోని రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వర్షంకోసం మండలంలోని బూర్గుడ గ్రామానికిచెందిన రైతులు కప్పతల్లి ఆటఆడారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ వర్షం రాకపోవడంతో చేన్లలో నాటిన పత్తిగింజలు చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కూడా నాటిన గింజలు మొలకెత్తలేదన్నారు. వందలాది ఎకరాల్లో గింజలు మొలకెత్తని పరిస్థితి ఉందని అందుకే కప్పతల్లి ఆటతో దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

వర్షాల కోసం పూజలు

దహెగాం: మండలంలోని పార్వతిపేట గ్రామస్తులు గురువారం వర్షం కురవాలని గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఇంటింటా బోనాలతో ఆలయం చుట్టు ప్రదక్షణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

రెబ్బెన: మండలంలోని తుంగెడలో గురువారం వర్షాలు కురవాలని రైతులు పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిస్తే రైతులందరికి మేలు జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు గ్రామస్థులు తెలిపారు.

ఫీల్డు అధికారికి సన్మానం

రెబ్బెన, జూన్ 20: తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న ఫీల్డుఅధికారి నరేష్‌ను గురువారం ఘనంగాసన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ వేముర్ల సంతోష్ మాట్లాడుతూ ఫీల్డు అధికారిగా పనిచేసిన నరేష్ సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శాస్త్రి, జకీర్, ముంజం రవి రైతులు పాల్గొన్నారు.

అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్, జూన్ 20: కాగజ్‌నగర్ పట్టణ కాంట్రాక్టర్ కట్టప్రసాద్ తండ్రి బ్రహ్మానందరావు గురువారం ఉదయం మృతిచెందారు. మధ్యాహ్నం అంతిమయాత్ర నిర్వహించగా మాజీఎమ్మెల్యే కోనప్పతోపాటు స్థానిక నాయకులు, వివిధ వార్డులకు చెందిన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

చింతలమానేపల్లి, జూన్ 20: రైతులు అయిల్‌పామ్ సాగుపై దృష్టిసారించా లని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారి ఎం వెంకటేశం అన్నారు. గురువారం మండలంలోని డబ్బా, గంగాపూర్‌గ్రామాల్లో ఆయిల్‌పామ్ పంటలసాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువులవాడకం, కలుపునివారణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు, హార్టికల్చర్ ఆఫీసర్‌శాంతిప్రియ, జైన్‌ఇరిగేషన్‌కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

దహెగాం, జూన్ 20: మండలంలోని చౌక గ్రామానికి చెందిన కొలిపాక సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఉత్తమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. చౌక గ్రామానికి చెందిన కొలిపాక హన్మంతు, సంతోష్ తండ్రి, కొడుకులు. కాగా భూ పంపిణీ విషయంలో సంతోష్ తండ్రిని దూషిస్తూ కొట్టాడు. ఈమేరకు తండ్రి హన్మంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతోష్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

టీడీపీ నాయకుడు బుచ్చిలింగం 5వ వర్ధంతి

కాగజ్‌నగర్, జూన్ 20: టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి బుచ్చిలింగం 5వ వర్ధంతిని గురువారం కాగజ్‌నగర్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా బుచ్చిలింగం చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ ఆసుపత్రిల్లో రోగులకు పండ్లు, బ్రేడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు గుళ్లపల్లి ఆనంద్ పెరుగు ఆత్మరాం, చల్లూరి శంకర్, ఎల్ మధుకర్, గుళ్లపల్లి లావణ్య, సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కాగజ్‌నగర్, జూన్ 20: పట్టణంలోని ఎస్పీఎం హెచ్‌ఆర్‌డీ హాలులో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీఎం కార్మికులు, ఉద్యోగులు రక్తదానంలో పాల్గొన్నారు. అనంతరం మిల్లు వైస్ ప్రసిడెంట్ ఏకేమిశ్రా మాట్లాడుతూ జేకే మిల్లు గ్రూపుసంస్థల వ్యవస్థాపకుడు హరిశంకర్ సింఘానియా పుట్టిన రోజును పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించటం గొప్ప విషయమన్నారు. శిబిరంలో సీజీఎం సురేందర్, జనరల్ మేనేజర్ గిరి, డాక్టర్ నయిం హైమద్‌కాన్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కుమరం భీం
జిల్లా వార్తలు

8

శుక్రవారం 21 జూన్ 2024



ఆధార్‌సంఖ్యను ఐఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలి

ఆసిఫాబాద్, జూన్ 20: జిల్లాలోని డ్రాయింగ్అండ్‌డిస్బర్స్‌మెంట్ అధికారు లందరూ తమతమ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులందరి ఆధార్ సంఖ్యను ఐఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా కోశాధికారి జాడి రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకుముందు ఐఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేసి ఉంటే వారి ఆధార్‌సంఖ్యను సరిచూసుకోవాలన్నారు. జూన్ జీతం బిల్లుతో పాటు ఆధార్‌సంఖ్య నమోదుకు సంబంధించిన సర్టిఫికేట్లు జత చేయాలన్నారు. సర్టిఫికేట్ నమూనా సంబంధితఖజానా కార్యాలయంలో లభిస్తుందన్నారు. జూన్ 25లోగా సంబంధిత అధికారులు నమోదును పూర్తిచేయాలని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జూన్ 20: జిల్లా ఎస్పీగా డీవీ శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ డీసీపీగా పనిచేసి బదిలీపైవచ్చి జిల్లాఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. 2013ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు, 2007గ్రూప్-1సర్వీసెస్ ద్వారా ఎంపికై కరీంనగర్ డీఎస్పీగా నియమితులయ్యారు. గతంలో మహబూబ్ నగర్ ఏఎస్పీగా, రాచకొండ కమిషనరేట్‌లో అడ్మిన్‌గా, నల్గొండ జిల్లా విజిలెన్స్‌శాఖ ఎస్పీగా విధులు నిర్వహించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించి జిల్లాలోని పోలీసుఅధికారులతో సమావేశమయ్యారు. ఈసమావేశంలో జిల్లాలో శాంతి భద్రతలపై, సమస్యలపై అధికారులతో చర్చించితీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కాగా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పలుఅంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంనాయక్, రమేష్, మారుతి, మంగ, జక్కన్న, శ్రీనివాస్, ఆనంద్, శ్రీకాంత్, మిలింద్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సమష్టిగా కృషి చేద్దాం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జూన్ 20: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు సమష్టిగా పనిచేద్దామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డీవీ శ్రీనివాసరావు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణఅంశంలో సమన్వయతో పనిచేసి ప్రజారక్షణకు కృషిచేద్దామన్నారు. డీవీ శ్రీనివాసరావు సైబరాబాద్ పరిధిలోని మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీగా విధులు నిర్వహిస్తూ జిల్లాఎస్పీగా బదిలీపై వచ్చారు.

రైతులకు యూరియా బస్తాల పంపిణీ



రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, జూన్ 20: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సహకారసంఘం కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, సహకార చైర్మన్ అలీబీన్ అహ్మద్‌తో కలిసి రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు అధిక ధరలు పెట్టి యూరియాబస్తాలను కొనుగోలుచేయకూడదన్నారు. సహకార సంఘంలో యూరియా బస్తాలు తక్కువ అందుబాటులో ఉన్నాయని త్వరలో అన్ని గ్రామాలకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో ఖాదర్‌హుస్సేన్, డైరెక్టర్‌లు ఆశన్న, పెంటయ్య, మధుకర్, బాపురావు, నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

వాంకిడి: విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థానాలకు ఎదుగుతారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌లో ప్రతిభకనబర్చిన వాంకిడి ప్రభుత్వజూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి దుర్గం అర్జున్‌ను గురువారం ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులంతా అర్జున్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు చంద్రయ్య తదితరులు ఉన్నారు.

ఉపకారవేతనాలకు ఎంపికైన విద్యార్థులు



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఖలీల్

ఆసిఫాబాద్, జూన్ 20: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ మోడల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జెట్ సూపర్-20 స్కాలర్ షిప్‌నకు ఎంపి కైనట్లు ప్రిన్సిపాల్ ఖలీల్ తెలిపారు. జటాదరా ఎడ్యుకేషన్ టెక్నాలజీ వారు రాష్ట్రంలో పదో తరగతి పాసైన విద్యార్థులకు నిర్వహించిన సూపర్-20 స్కాలర్‌షిప్ పరీక్షలో పాఠశాలకు చెందిన గుండేటిభావన, మసాదే మనస్విని, ఆడె దీపిక ప్రతిభ కనబర్చి స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 20మంది విద్యార్థులు ఎంపిక కాగా అందులో ముగ్గురు మోడల్ స్కూల్ విద్యార్థులు ఉండడంపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

ఆసిఫాబాద్, జూన్ 20: కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌పార్టీ నుంచి పలువురు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

అన్నదాతల హర్షం



- పంటలకు మద్దతు ధర ప్రకటించిన కేంద్రం
- వరి, మొక్కజొన్న, పత్తితో సహా 14రకాల పంటలకు పెరిగిన మద్దతు
- జిల్లాలోని రైతాంగానికి మేలు..
- జిల్లాలో 4.5లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు..

చింతలమానేపల్లి, జూన్ 20: వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని రైతాంగానికి కేంద్రప్రభుత్వం ఊరటనిచ్చే కబురు చెప్పింది. 14రకాల పంటలకు కనీసమద్దతు ధర పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలోని రైతులకు మేలు జరుగనుంది. జిల్లాలోని ఆసి ఫాబాద్, సిర్పూర్(టి) డివిజన్ల పరిధిలో పత్తి, వరి, మొక్కజొన్న, కందులు, అధికంగా సాగుచేస్తారు. మిర్చి, పెసర, మినుములు, జొన్నలు, ఉలువలు, తదితర పంటలు తక్కువగా సాగు చేస్తుంటారు. వరి, మొక్క జొన్న పంటలను వానాకాలం, యాసంగి సీజన్లలో సాగు చేస్తారు. అయితే సుమారుగా వరి ఎకరాకు రూ.25 వేలు, మొక్కజొన్నకు రూ.10వేలు, పత్తి పంటకు రూ.35వేల వరకు పెట్టుబడి పెడుతుంటారు. చీడపీడలు ఆశించకుండా ప్రకృతి సహకరిస్తే ఎకరాకు 27 నుంచి 30క్వింటాళ్ల ధాన్యం, 10నుంచి 15క్వింటాళ్ల వరకు పత్తి, 20నుంచి 30 క్వింటాళ్ల వరకు మొక్క జొన్న పంటలు దిగుబడి వస్తాయి. ఏటా సాగు ఖర్చులు పెరిగి రైతన్న నష్టపోతూనే ఉన్నాడు. ప్రకృతి సహకరించకపోవడం, చీడ, పీడల వల్ల రైతులకు ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక ఇబ్బందులు పడుతున్నారు. అయితే తాజాగా కేంద్రం వివిధ రకాల పంటలకు మద్దతు ధరలు పెంచడంతో అన్నదాతలు కొంత ఉపశమనం పొందే అవకాశం ఉంది. ఈ మద్దతు ధరతోనే బహిరంగ విపణిలో పోటీ ఏర్పడి లాభం చేకూరే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు.

ఏల్లాలో 4.6లక్షల ఎకరాల్లో పంటల సాగు..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 4,60,196 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రధానంగా పత్తి పంట 3.5లక్షల ఎకరాలు, వరి 59,212ఎకరాలు, కంది 38,239ఎకరాలు, మొక్కజొన్న 742ఎకరాలు, జొన్న 680ఎకరాలు, పెసరా 1700ఎకరాలు, మినుములు 163ఎకరాలు, సోయాబీన్ 6083ఎకరాలు, మిరప 3173, వేరుశనగ 178 ఎకరాలు, ఆముదాలు 10ఎకరాలు, నువ్వులు 10 ఎకరాల్లో సాగ వుతాయని అంచనా. జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష పైచిలుకు రైతులకు ఈ మద్దతు ధరతో లబ్ధి చేకూరనుంది.

2024-25 ఖరీఫ్ సీజన్‌కు పంటల కనీస మద్దతు ధర ఇలా.. (క్వింటాల్‌కు రూ.):

పంట	2023-24	2024-25	పెంపు
వరి సాధారణం	2,183	2,300	117
వరి ఏ గ్రేడ్	2,203	2,320	117
జొన్న హైబ్రిడ్	3,180	3,371	191
జొన్న మాల్దండి	3,225	3,421	196
సజ్జ	2,500	2,625	125
రాగి	3,846	4,290	444
మొక్కజొన్న	2,090	2,225	135
కంది	7,000	7,550	550
పెసరా	8,558	8,682	124
మినుములు	6,950	7,400	450
వేరుశనగ	6,377	6,783	406
పొద్దుతిరుగుడు	6,760	7,280	520
సోయాబీన్(పచ్చ)	4,600	4,892	292
నువ్వులు	8,635	9,267	632
వళిశలు(గడ్డినువ్వులు)	7,734	8,717	983
పత్తి(మధ్యరకం)	6,620	7,121	501
పత్తి(పొడవురకం)	7,020	7,521	501

పంటలకు మద్దతు ధర పెంపుతో రైతులకు మేలు..: రంగన్న రైతు



కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో రైతాంగానికి మేలు జరుగనుంది. ఏటా పంటల మద్దతు ధర పెంచుతూ నిర్ణయం తీసుకోవడం హర్షనీయం. దీం తో రైతులు మరింత ఉత్సాహంతో పం టల సాగుకు ముందుకు వెళ్తారు. ఈ విధంగా రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలి.

నులి పురుగుల నివారణకు కృషిచేయాలి: కలెక్టర్



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూన్ 20: నులి పురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లా వైద్యాధికారి తుకారాంభట్‌తో కలిసి కలెక్టర్ నులిపురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెప్పులు లేకుండా నడవడం, మట్టిలో ఆడటం, చాక్‌పీసులు, బలపాలు, మట్టి తినడం వల్ల పిల్లల శరీరంలో నులిపురుగులు తయారవుతాయని అన్నారు. ఇవి పేగుల్లో ఉండి రక్తాన్ని పీల్చుకుంటాయన్నారు. నులిపురుగల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, చల్లార్చిన నీటిని తాగడం, పండ్లను, కూరగాయలను నీటితో కడిగిన తరువాతనే తినడం తరుచూ చేతులను శుభ్రం చేసుకోవడం వంటివి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుదాకర్‌నాయక్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నులి పురుగుల మాత్రల పంపిణీ..

ఆసిఫాబాద్: మండలంలోని చిర్రకుంట ప్రభుత్వపాఠశాల, అంగన్‌వాడీకేంద్రాల్లో గురువారం ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ విద్యార్థులకు నులి పురుగుల నివారణమాత్రలువేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ నులిపురుగుల నివారణ మాత్ర లు వేసుకోవాలన్నారు.

మండలాల్లో..

బెజ్జూరు/చింతలమానేపల్లి/ పెంచికలపేట/దహెగాం/సిర్పూర్(టి)/ సిర్పూర్(యు)/కెరమెరి: మండల కేంద్రాలతోపాటు అన్ని గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీకేంద్రాల్లో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులి పురుగుల నివారణ మనందరి బాధ్యత అని అన్నారు. వీటివల్ల శరీర ఎదుగుదలతోపాటు మనిషిలోని రోగనిరోధ కశక్తి కూడా తగ్గే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరు దీనిని ఒక యజ్ఞంలా తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆశా వర్కర్లు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీటీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరున్నర క్వింటాళ్ల బెల్లం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బెల్లం దబ్బాలు

కాగజ్‌నగర్ టౌన్/చింతలమానేపల్లి, జూన్ 20: నాటుసారాయి తయారీకి ఉపయోగించే బెల్లాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించగా మినీవ్యాన్‌లో ఆరున్నర క్వింటాళ్ల బెల్లాన్ని స్వాధీనపరుచుకొని తరలిస్తున్న అజ్మీర సీతారాం, సైరి రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తాగుడుకు బానిసై ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్, జూన్ 20: కాగజ్‌నగర్ శ్రీరాంనగర్ కాలనికి చెందిన అవదూత భాస్కర్(30) అప్పుల బాధ భరించలేక తాగుడుకు బానిసై గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. భాస్కర్ కొంతకాలంగా అప్పుల బాధ భరించలేక తాగుడుకు బానిసయ్యాడు. గురువారం బాధ భరించలేక ఇంట్లో ఉన్నఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నిహారిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

గుండెపోటుతో వెల్డింగ్ వర్కర్ మృతి



శంకర్(ఫైల్)

సిర్పూర్(టి), జూన్ 20: మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్లులో మందమర్రికి చెందిన శంకర్(46) బుధ వారం రాత్రి నిద్రలో గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడి సోదరుడు, తోటి కూలీలు, రైస్‌మిల్లు యజమాని తెలిపిన వివరాలప్రకారం.. శంకర్ మూడురోజుల నుంచి రైస్‌మిల్లులో వెల్డింగ్ పనుల నిమిత్తంగా వచ్చాడు. రాత్రి గుండెపోటుతో రావడంతో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపు తున్నట్లు ఎస్సై దీకొండ రమేష్‌తెలిపారు. శంకర్ మృతిపై ఎలాంటి అనుమానం లేదని ఆయన సోదరుడు అనిల్ పోలీసుస్టేషన్‌లో స్పష్టం చేశారు.

డీఎస్పీని సస్పెండ్ చేయాలని ఆదివాసీల రాస్తారోకో



జైనూర్‌లో ప్రధానరోడ్డుపై రాస్తారోకో చేస్తున్న ఆదివాసీలు

జైనూర్, జూన్ 20: ఇటీవల పార్లమెంట్ ఎన్నికల రోజున ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షనలో శాంతి భద్రతల్ని పోలీసులు అదుపు చేయలేక పోయారని నిరసిస్తూ మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుపై గురువారం ఆదివాసీలు రాస్తారోకో నిర్వహించారు. ఈ ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటూ ఆసిఫాబాద్ డీఎస్పీని సస్పెండ్ చేయాలని ఆదివాసీల సంఘాల నాయకుడు, రాయిసెంటర్ జిల్లా గౌరవఅధ్యక్షుడు కనక యాదవ్‌రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాస్తారోకోలో ఆయన మాట్లాడుతూ 144సెక్షన్ అమలులో ఉండగా, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఒడ్డెరకాలనీపై ఓవర్గం వారు రాడ్లు, కర్రలతో దాడికి పాల్పడడం అప్రజాస్వామికమన్నారు. చట్టాన్ని చేతుల్లో తీసుకొని వారు గూండాయి జానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సంఘటన నేపథ్యంలో సిర్పూర్(యు) మండలం పాములవాడకు చెందిన ఓ ఆదివాసీపై, ఒడ్డెరకాలనీలో ఉంటున్న దళితకుటుంబాలపై దాడి చేసినవారిపై హత్యానేరంతో పాటు అట్రాసిటీ కేసునమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా చిన్నపాటి వివాదాన్ని కొందరు కావాలని పెద్దగా చేసి మండల కేంద్రంలో భయం దోళనలు సృష్టించారని ఆయన అన్నారు. ఏ తప్పుచేయని 20మంది వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారని అస లైన దోషులపై కేసులు నమోదు చేయడంలో విఫలం చెందారని ఆరోపించారు. వచ్చే పదిరోజులల్లో డీఎస్పీపైచర్యలు తీసుకోకపోతే వందలాదిమందితో ఆసిఫాబాద్ ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాస్తారోకోసందర్భంగా పెద్దసంఖ్యలో వాహనాలు రోడ్డుపై నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో రాస్తారోకోను విరమించాలని ఎస్సై సందీప్‌కుమార్ ఆదివాసీ నాయకులను కోరే క్రమంలో పోలీసులు, ఆదివాసీ సంఘాల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆదివాసీ సంఘాల ప్రధాన డిమాండ్లను జిల్లా పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నాయకులు రాస్తారోకోను విరమించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఆత్రం భీంరావు, తోడసం ధర్మారావు, రాంజీ, చాయకటి గణేష్, మెస్రం కమలబాయి, ఒడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు రాపెన రమేష్, గ్రామీణ పేదల సంఘం జిల్లా నాయకుడు జిల్లేపల్లి శంకర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు, సుబోద్, శ్రీకాంత్, శివరాం తదితరులు పాల్గొన్నారు.



విధులకు తప్పనిసరిగా హాజరుకావాలి

శ్రీరాంపూర్, జూన్ 20: ఉద్యోగులు విధులకు తప్పనిసరిగా హాజరుకావాలని ఎస్‌ఆర్‌పీ3 జీఎం వి పురుషోత్తమరెడ్డి అన్నారు. జీఎం కార్యాలయం సమావేశమందిరంలో గురువారం గైర్హాజరు కార్మికులు, వారి కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐకే1ఏ గనిలో పనిచేస్తున్న ఉద్యోగులు 2023సంవత్సరంలో కనీసం 100మస్టర్లు, 2024సంవత్సరంలో కనీసం 50 మస్టర్లు కూడా చేయనివారికి మరో అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. వెంటనే వారు విధులకు హాజరై తమఉద్యోగాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రతినెలకనీసం 20మస్టర్లు చేయాలని, లేనిపక్షంలో కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌన్సెలింగ్‌కు 70మంది గైర్హాజరు ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీబ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కెబాజీసైదా, సేవాఅధ్యక్షురాలు రాధాకుమారి, డీజీఎం (పర్సనల్) పి అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు

రెబ్బెన, జూన్ 20: పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఏఐటీయూసీ అధ్యక్షుడు, కేంద్రకమిటీ సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య, సింగరేణి కాలరీస్‌వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓపెన్‌కాస్టు, సీహెచ్‌పీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లలో వారు మాట్లాడారు. యూనియన్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి చిప్పనర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, బయ్య మొగిలి పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలం వద్దు

శ్రీరాంపూర్, జూన్ 20: సింగరేణి కోట్లరూపాయల ఖర్చుతో తవ్విన బొగ్గుబ్లాకులను వేలం వేయవద్దని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎండీ రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్‌ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గుగనులను వేలంవేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీనివల్ల యువతకు పర్మనెంట్ ఉద్యోగాలు రాక నష్టం జరుగుతుందన్నారు. 137ఏళ్ల చరిత్రఉన్న సింగరేణికి కాకుండా ప్రైవేటువ్యక్తులకు బొగ్గుబ్లాకులను అప్పగిస్తే సంస్థకు ఆర్థికంగా నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నామినేషన్ పద్ధతిలో సింగరేణి బొగ్గుబ్లాకులను సింగరేణికే కేటాయించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

మందమర్రిటౌన్: దేశవ్యాప్తంగా ఉన్న 60బొగ్గుబ్లాకులకు నేడు నిర్వహించే వేలం పాటలను నిలిపివేయాలని సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం మందమర్రిలో ఆయన మాట్లాడుతూ వేలంపాటలు పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం వేస్తున్నారని మండిపడ్డారు. అపార బొగ్గు నిక్షేపాలున్న సర్వే పూర్తయిన శ్రావణపల్లిని వేలంపాట వేయవద్దని డిమాండ్ చేశారు. గతంలో మోదీ ప్రభుత్వం బొగ్గుబ్లాకులకు వేలం పాటలు వేస్తే సింగరేణి బ్లాకులను ఎవరు తీసుకోలేదన్నారు. వేలం పాటలను వేయకుండా ఆ గనులను రాష్ట్రానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణతో సింగరేణి ఉద్యోగుల ఉద్యోగాలకు ముప్పు వాటిల్లనుందన్నారు. వేలంపాటల విషయంలో కార్మికసంఘాలన్నీ ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

అనుమతులకు లోబడి పనులు చేయాలి: ఐఆర్‌వో త్రినాథ్



ఓపెన్ కాస్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఐఆర్‌వో త్రినాథ్

ఆసిఫాబాద్, జూన్ 20: కేంద్రప్రభుత్వ అనుమతులకు లోబడి సింగరేణి ఓపెన్ కాస్టు పనులు చేయాల్సి ఉంటుందని కేంద్ర పర్యావరణశాఖకు సంబంధించిన ఇండియన్ రీజనల్ అధికారి(ఐఆర్‌వో) త్రినాథ్ అన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, తిర్యాణి, రెబ్బెన రేంజ్‌పరిధిలోని గోలేటి ఓసీపీ, డోర్లి ఓసీపీ, డి గ్రేడెడ్ అటవీ ప్రాంతంతోపాటు అటవీశాఖకు బదిలీఅయిన రెవెన్యూభూములను కాళేశ్వరం ఎఫ్‌డీపీటీ శాంతారాం, జిల్లా అటవీశాఖాధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గోలేటి ఉపరితల బొగ్గుగనుల్లో భాగంగా 615హెక్టార్ల అటవీ భూమికి బదిలీ అనుమతుల కోసం ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపారు. దీనికి డోర్లిలో ఇప్పటికే మూసివేసిన సింగరేణి గనుల ప్రాంతాన్ని అటవీశాఖకు అప్పగించినట్లు తెలిపారు. అయితే అనుమతుల కోసం ఇచ్చిన ప్రతిపాదనకు మించి ఎక్కువ భూమి బదిలీకాకుండా చూడాలని అన్నారు. సింగరేణి అధికారులు ఎప్పటికప్పుడు అటవీఅధికారులతో సమన్వయం చేసుకుంటూ భూబదిలీ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో అప్పలకొండ, ఎఫ్‌డీవో విజయ్‌కుమార్, జీఎం రవిప్రసాద్, ఎఫ్ఆర్వో శ్రీనివాస్, రెబ్బెన, బెల్లంపల్లి, గిన్నధరి ఇన్‌చార్జి ఎఫ్ఆర్వోలు శ్రీధరచారి, సుభాష్‌ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో కేంద్రపర్యావరణ, అటవీమంత్రి త్వశాఖ పరిధిలోని ఐఆర్‌వో డాక్టర్ త్రినాథ్‌కుమార్ గోలేటి ఓసీ కోసం సేకరించిన అటవీభూములను గురువారం పరిశీలించారు. అలాగే సింగరేణి ఆధ్వర్యంలో నాటిన మొక్కలు, పెంచిన వృక్షాలను పరిశీలించారు. కార్యక్రమంలో జీఎం రవిప్రసాద్, శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్ కుమార్, ఎఫ్‌డీవో విజయ్‌కుమార్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.